క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభచాటారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, (భారత నాణ్యత ప్రమాణాల నిర్ధారణ సంస్థ) ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.సౌరవ్ తృతీయ బహుమతి సాధించాడు. అలాగే ఎం.మధురిమ ప్రోత్సాహక బహుమతి గెల్చుకుని పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని హెచ్‌ఎం డాక్టర్ చకినాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్మీ, కేంద్రీయ విద్యాలయ సంస్థల విద్యార్థులతో పోటీపడే స్థాయి అందుకుంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తాం


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో వర్షంతో ఇల్లు కూలిపోయి ఓ కుటుంబం రోడ్డున పడగా, బాధితురాలికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి కట్టిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన జల్లి పోచవ్వ ఇల్లు కూలిపోగా శనివారం నాయకులు పరిశీలించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి వెంటనే ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. తక్షణంగా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. చల్ల పద్మారెడ్డి, కొంగరి కిష్టారెడ్డి, మర్రాక సత్తయ్య, బాలపోచయ్య, ఏలూరి రాజయ్య, దేవయ్య తదితరులున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

రుద్రంగి: నేలలో భూసారం కాపాడేందుకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏవో ప్రియదర్శిని రైతులకు సూచించారు. శనివారం మండలానికి 800 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఇంకా కావాల్సిన యూరియాను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన పులి లక్ష్మి అచూకీ లభ్యమైంది. లక్ష్మికి కొన్ని రోజులుగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ నెల 7 నుంచి కనిపించకపోవడంతో కుమారుడు ప్రశాంత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో కనగర్తి–మల్కపేట గ్రామాల మధ్య లక్ష్మి కనిపించడంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట: ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి సారియా అంజుమ్ అన్నారు. 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

గుంతలుపూడ్చిన గ్రామస్తులు


గుంతలు పూడ్చుతున్న వల్లంపట్ల గ్రామస్తులు

ఇల్లంతకుంట: రోడ్డు బాగాలేదని వారం క్రితం ఆర్టీసీ బస్సు బంద్ కావడంతో గ్రామస్తులు కదిలి శ్రమదానంతో శనివారం రోడ్డు బాగు చేసి బస్సుకు రైట్‌రైట్ అనేలా చేశారు. మండలంలోని వల్లంపట్ల గ్రామానికి వెళ్లే దారి గుంతలమయంగా మారింది. దీంతో ఆ గ్రామానికి నాలుగు ట్రిప్పులు నడిచే బస్సును రెండు ట్రిప్పులకు కుదించారు. ఈక్రమంలో గ్రామస్తులు ఇబ్బందులు పడగా, సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. గ్రామంలోని జేసీబీ, ట్రాక్టర్ల యజమానుల సాయంతో ఓగులాపూర్ కెనాల్ నుంచి వల్లంపట్ల వరకు రోడ్డుపై ఉన్న గుంతల లో 190 ట్రాక్టర్ల మొరం పోసి పూడ్చివేశారు. బస్సుల ట్రిప్పులు పునరుద్ధరించాలని డిపో మేనేజర్‌తో గ్రామస్తులు మాట్లాడగా ఆదివారం రోడ్డు పరిశీలించి యథావిధిగా కొనసాగిస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు. శ్రమదానంలో కె.వెంకటనరసింహారెడ్డి, కుర్ర రమేశ్, భాస్కర్, రాజయ్య, రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, వేణు, రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలన్నారు.


సిరిసిల్ల: మొక్కకు రాఖీ కడుతున్న అమూల్య


వేములవాడఅర్బన్: వేములవాడ బస్టాండ్‌లో రాఖీ వేడుకలు జరుపుకుంటున్న అధికారులు, సిబ్బంది


కోనరావుపేట: కాగితాలతో రాఖీలు తయారు చేస్తున్న బ్లెస్సీ


ముస్తాబాద్: సోదరులకు రాఖీలు కడుతున్న చెల్లెళ్లు

అనుబంధాల సంబరం

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్/ఎల్లారెడ్డిపేట/రుద్రంగి/వీర్నపల్లి/ముస్తాబాద్/ఇల్లంతకుంట/కోనరావుపేట/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్: అన్నాచెల్లెల్ల అనుబంధాల వారధి రాఖీ పండుగను శనివారం జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన చిన్నారి చెరుకు అమూల్య వినూత్నంగా మొక్కలకు రాఖీ కట్టి వాటి రక్షణ కోరింది. ఎల్లారెడ్డిపేటలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డికి సోదరీమణులు రాఖీలు కట్టారు. వీర్నపల్లిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మణ్‌కు తన చెల్లి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రకాశ్ కూతురు బ్లెస్సీ వంద చెట్లకు పర్యావరణ రాఖీలు కట్టింది. వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు రాఖీలు కట్టుకుని సంబరాలు జరుపుకున్నారు.


సిరిసిల్లలో సోదరులకు రాఖీలు కడుతున్న చెల్లెళ్లు


వీర్నపల్లి: అన్నకు రాఖీ కడుతున్న చెల్లె హేమలత


ఇల్లంతకుంట: వేణుకు రాఖీ కడుతున్న సోదరి


ఎల్లారెడ్డిపేట: కృష్ణారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి


ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బోరు లీకేజీతో తాగునీరు రోడ్ల వెంట వృథాగా పోతోంది. తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బోరుకు అమర్చిన పైపులు పాడై 15 రోజుల నుంచి నీరు వృథాగా పోతోంది. కుమ్మరిల్ల గడ్డ కాలనీలో సుమారు వంద కుటుంబాలకు నీరందించే బోరు చెడిపోయినప్పటికీ మరమ్మతు చేయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సంతోష్, పంచాయతీ కార్యదర్శి సెల్ నంబర్: 9949431891

వాట్సాప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పాఠశాలకు చేరిన సైకిళ్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో గల 9 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మోదీ కానుక పేరుతో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు శనివారం సైకిళ్లు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నాయి. బండి సంజయ్‌కుమార్ జన్మదినం రోజు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి తెలిపారు.


ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైకిళ్లు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్లటౌన్: ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి కోరారు. సిరిసిల్లలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కేటీఆర్ స్థానికంగా ఉండకుండా ప్రజల బాగోగులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఫోన్‌ట్యాపింగ్ విషయంలో సిట్‌కు హాజరై విచారణ తర్వాత విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. భార్యాభర్తలు, సినీ హీరో హీరోయిన్ల వ్యక్తిగత సంభాషణలు వినడం బండి సంజయ్‌కు తెలియదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అక్రమాలు బహిర్గతం కావడం తట్టుకోలేక కేటీఆర్.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బురద జల్లే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. ఆట రవీందర్, దుమాల శ్రీకాంత్, జ్ఞాన రాంప్రసాద్, శ్రీరామ్ రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపి

వరదవెల్లిలో గిరిప్రదక్షిణ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లిగుట్టపై స్వయంభూగా వెలసిన గురు దత్తాత్రేయ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం భక్తులు గిరిప్రదక్షిణ నిర్వహించారు. భక్తుల గిరిప్రదక్షిణలో దత్త నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. గిరిప్రదక్షిణ చేసిన అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


గిరి ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు


కోనరావుపేట: నిమ్మపల్లిలో శోభాయాత్ర


తంగళ్లపల్లి: జంధ్యాలు ధరిస్తున్న పద్మశాలీలు

ఘనంగా నూలు పౌర్ణమి

తంగళ్లపల్లి/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/బోయినపల్లి: పద్మశాలీలకు పవిత్రమైన పండుగ నూలు పౌర్ణమిని శనివారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి జంద్యాలు (యజ్ఞోపవేతాలు) ధారణ చేశారు. తంగళ్లపల్లిలో సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, పద్మనగర్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్ పాల్గొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీమార్కండేయ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తడుక బాలకిషన్, నందు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని మార్కండేయస్వామి ఆలయంలో అర్చకుడు ఉమాశంకర్ శర్మ నేతృత్వంలో ఉదయం గణపతి తదితర పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రాపెల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శి వనం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో మార్కండేయుని శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. బోయినపల్లి మండలకేంద్రంలోని శివాలయం, బూర్గుపల్లిలో హనుమాన్, విలాసాగర్‌లో శ్రీత్రిలింగ సంగమేశ్వరస్వామి, తడగొండ సాయి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్‌పై చేనేత మగ్గం ఏర్పాటు చేసి ప్రధాన వీధుల్లో భజనలు చేస్తూ తిరుగుతూ వస్త్రం నేశారు. సంఘం అధ్యక్షుడు బిల్ల మల్లేశం, శ్రీపతి శ్రీనివాస్, మ్యాన కరుణాకర్, భీమనాథుని రమేశ్, వాసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బోయినపల్లి: మార్కండేయుని శోభాయాత్ర


ముస్తాబాద్: పూజలు చేస్తున్న పద్మశాలీలు


ఎల్లారెడ్డిపేట: జంధ్యాలు ధరిస్తూ..

ఉషోదయపు ఉపాధి

సిరిసిల్ల: డిగ్రీలు, పీజీలు చేసినా ఉద్యోగాలు రావడం లేదని.. ఉపాధి లేక ఇల్లు గడవడం లేదని, ఏదైనా వ్యాపారం చేస్తామంటే.. పెట్టుబడి లేదని, బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని నేటి యువతరం విసిగిపోతోంది. సెల్‌ఫోన్లు చూస్తూ, రీల్స్ చేస్తూ కాలక్షేపంతో కాలం వెల్లబుచ్చుతున్నారు ఎందరో యువకులు. అందుకు భిన్నంగా ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారు సిరిసిల్ల కార్మిక క్షేత్రానికి చెందిన ఆంకారపు శివకృష్ణ. సిరిసిల్లలోనే డిగ్రీ చేసిన శివకృష్ణ తెల్లవారుజామునే శ్రమిస్తూ స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నాడు.


సిరిసిల్ల కోర్టు వద్ద జ్యూస్ విక్రయిస్తున్న శివకృష్ణ

- ఆరోగ్య ప్రదాయిని గుమ్మడికాయ తదితర జ్యూస్‌ల విక్రయం
- చిన్న పెట్టుబడితో కుటుంబ పోషణ
- ఆదర్శంగా నిలుస్తున్న యువకుడు


గుమ్మడికాయ, ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్ మిశ్రమ జ్యూస్


పెసర్లు, బబ్బెర్లు, క్యారెట్, బీట్‌రూట్ మిశ్రమ మొలకల బాక్స్‌లు

ఇంట్లో తయారీ.. వీధిలో విక్రయం

రోజూ ఉదయంపూట వాకింగ్, జాగింగ్ చేసేవారికి అవసరమైన జ్యూస్‌లను ఇంట్లో తయారీ చేసి సిరిసిల్ల కోర్టు ఎదురుగా టేబుల్‌పై పెట్టుకుని విక్రయిస్తున్నాడు. ఆరోగ్య ప్రదాయినిగా భావించే గుమ్మడికాయ, సొరకాయ, దోసకాయల జ్యూస్, మరోవైపు ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్(ఏబీసీ) జ్యూస్ నుల మిశ్రమం, పెసర్లు, బబ్బెర్లు, పచ్చిబఠానీలను నానబెట్టి మొలకలు వచ్చిన వాటితో క్యారెట్, బీట్‌రూట్ ముక్కల మిశ్రమాన్ని తయారు చేసి బాక్స్‌ల్లో విక్రయిస్తున్నాడు. జ్యూస్‌లు రూ.20 గ్లాసు చొప్పున, మొలకల బాక్స్‌లను సైతం రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నాడు. ఇంట్లోనే అన్నీ సిద్ధం చేసుకుని, రోడ్డుపై ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు వాటిని అమ్ముతున్నాడు.

రూ.25వేల పెట్టుబడి..

శివకృష్ణ నాన్న పోశెట్టి సాంచాలు నడిపిస్తాడు. అమ్మ సుజాత బీడీలు చేస్తుంది. అతడి భార్య లాస్యశ్రీ చదువుకుంటుంది. అతనికి ఒక్క బాబు. నేత కార్మిక కుటుంబానికి చెందిన శివకృష్ణ కేవలం రూ.25వేల పెట్టుబడితో నమ్మకమైన ఉపాధికి బాటలు వేసుకున్నాడు. జ్యూస్‌లు పట్టేందుకు ప్రత్యేక మిక్సీమిషన్, జ్యూస్‌లను నిల్వ చేసేందుకు అందమైన జాడీల(సీసా గాసుతో కూడిన)లను, జ్యూస్ గ్లాసులు, మొలకలు విక్రయించే బాక్స్‌లు, స్పూన్లు ఇలా అన్నింటికీ రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టాడు. నిత్యం వాటిని అమ్మడం ద్వారా రూ.1200– రూ.1500 వరకు వస్తున్నాయి. ఇందులో ముడిసరుకులకు పెట్టుబడి పోను రోజూ రూ.800 నుంచి రూ.1000 వరకు వస్తుండగా, నెలకు రూ.24 వేల నుంచి రూ.30వేల వరకు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

వేకువజామునే నిద్రలేస్తా

రోజూ ఉదయం 4 గంటలకే నిద్రలేసి కాయలను ముక్కలు చేసుకుని జ్యూస్‌లు పట్టుకుంటా. మొదట్లో అందరూ చూస్తూ వెళ్లిపోయారు. రెండుమూడు రోజుల్లోనే జ్యూస్‌లకు అలవాటు పడ్డారు. ఎప్పుడైనా తెల్లవారుజామున వర్షం పడిన రోజు నేను రాకుంటే.. ఫోన్లు చేసి మరీ వస్తున్నారు. జ్యూస్‌ల వ్యాపారం బాగుంది.

– ఆంకారపు శివకృష్ణ, చిరువ్యాపారి

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్లఅర్బన్/బోయినపల్లి/తంగళ్లపల్లి: జిల్లా కేంద్రంలో శనివారం యువజన కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ వేడుకలను పట్టణ అధ్యక్షుడు పోగుల దేవరాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. చొప్పదండి నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో విశేష కృషి చేస్తున్నట్లు కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ పేర్కొన్నారు. బోయినపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు వొడ్నాల యగ్నేశ్ తదితరులు పాల్గొన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, ప్రవీణ్ జే టోని, చుక్క రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


తంగళ్లపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రమాదకరంగా గుంత



రుద్రంగి: మండల కేంద్రంలోని రామకిష్టాపూర్, మహాలక్ష్మికాలనీల మధ్య గల ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ఒర్రెలోని సిమెంటు రోడ్డు, మట్టిని తొలగించడంతో పెద్ద గుంత ఏర్పడింది. గుంత రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉంది. శనివారం కురిసిన వర్షంతో గుంతలో నీరు చేరింది. గుంతతో ప్రమాదాలు జరగకుండా ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేరు. ప్రమాదాలు జరగకముందే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చందుర్తి: చందుర్తి మండలకేంద్రంలోని 11కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ మహేశ్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.